వినతిపత్రం అందజేస్తున్న మడికొండ వాసులు

డంపింగ్ యార్డ్ తరలించాలి

మడికొండ, మార్చి 11: మడికొండ శివారులోని డంపింగ్ యార్డ్‌ను తక్షణమే తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మంగళవారం మడికొండకు చెందిన ప్రజలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డంపింగ్ యార్డ్ వల్ల కలుగుతున్న ఇబ్బందులను ప్రజాభవన్ ఇన్‌చార్జి డాక్టర్ చిన్నారెడ్డికి వివరించారు. ఆయన స్పందించి వెంటనే కలెక్టర్‌తోపాటు బల్దియా కమిషనర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తరలించేలా చొరవ తీసుకోవాలని ఆదేశించినట్లు చెప్పారు.

పనులను పరిశీలిస్తున్న కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద, కమిషనర్

చెరువు మట్టి తరలింపులో వేగం పెంచాలి

హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద

వరంగల్, మార్చి 11: భద్రకాళీ చెరువు పూడికతీసిన మట్టి తరలింపులో వేగం పెంచాలని హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద అధికారులను ఆదేశించారు. మంగళవారం గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడేతో కలిసి వారు భద్రకాళీ చెరువు పూడికతీత పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మట్టి తరలింపు ప్రక్రియను బుధవారం నుంచి ప్రారంభించాలన్నారు. మట్టి తరలించే వాహన రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. హనుమకొండ ఆర్డీవో రమేశ్ రాథోడ్, సాగునీటిపారుదల శాఖ ఈఈ శంకర్, డీఈ హర్షవర్ధన్, కుడా పీవో అజిత్ రెడ్డి, ఈఈ భీమ్‌రావు, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణలో ఆర్పీల సేవలు కీలకం

వరంగల్, మార్చి 11: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణలో రిసోర్స్‌పర్సన్ల (ఆర్పీలు) సేవలు ఎంతో కీలకమని మేయర్ గుండు సుధారాణి అన్నారు. వరంగల్‌లోని కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం ఆమె టౌన్ ప్లానింగ్ అధికారులు, ఆర్పీలతో సమీక్షించారు. 2020 ఆగస్టు 20వ తేదీ కంటే ముందు రిజిస్ట్రేషన్ అయిన తర్వాత కచ్చా లేఅవుట్ చేసిన వాటిలో కొనుగోలు చేసిన ప్లాట్ ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఫోన్ ద్వారా అవగాహన కల్పించాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు 25 శాతం రాయితీని వినియోగించుకునేలా చైతన్యం చేయాలన్నారు. నిత్యం ఒక ఆర్పీ వంద మంది దరఖాస్తుదారులకు ఫోన్ చేసి అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించేలా చూడాలన్నారు. బల్దియా, సర్కిల్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ల సేవలను వినియోగించుకోవాలన్నారు. మీసేవ కేంద్రాల ద్వారా ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లింపులు చేయొచ్చన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి పేమెంట్ మెసేజ్ వస్తుందని మేయర్ తెలిపారు. సమీక్షలో ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ రాజేశ్వర్, ఏసీపీలు ఎర్షాద్, రజిత, టీఎంసీ రమేశ్, సీవోలు పాల్గొన్నారు.

బల్దియాలో ఎల్ ఆర్ఎస్ జాతర

- హెల్ప్‌డెస్క్‌ల వద్ద బారులు
- అవగాహన లోపంతో దరఖాస్తుదారుల ఇబ్బందులు
- శాఖల వద్ద పేరుకుపోతున్న దరఖాస్తులు

హెల్ప్‌డెస్క్ వద్ద క్యూలో ఉన్న దరఖాస్తుదారులు

వరంగల్, మార్చి 11: వరంగల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్ జాతర కొనసాగుతున్నది. నాలుగు నెలలుగా వెలవెలబోయిన హెల్ప్‌డెస్క్ వద్ద దరఖాస్తుదారుల సందడి నెలకొంది. మార్చి 31లోగా ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ పూర్తి చేసుకొని ఫీజు చెల్లించిన వారికి 25శాతం రాయితీ కల్పించగా దరఖాస్తుదారులు ఆసక్తి చూపుతున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు వారం రోజులుగా కార్పొరేషన్ ప్రధాన కార్యాలయానికి క్యూ కడుతున్నారు. హెల్ప్‌డెస్క్ వద్ద గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. అయితే, హెల్ప్‌డెస్క్‌ల్లో ఎల్‌ఆర్‌ఎస్‌పై సరైన అవగాహన లేని సిబ్బందిని ఉంచడంతో గందరగోళంగా మారింది. సిబ్బందికి, దరఖాస్తుదారుల మధ్య నిత్యం వాగ్వాదం చోటుచేసుకుంటున్నది. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేసేందుకు మూడు శాఖల అధికారులను ఒకే చోటకు చేర్చారు. మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖల అధికారులు సమన్వయం తో ఒకే చోట పెండింగ్ దరఖాస్తులను క్లియర్ చేస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 25వేల దరఖాస్తులను మున్సిపల్ అధికారులు క్లియర్‌చేయగా, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. రెవె న్యూ అధికారుల వద్ద 20వేలు, ఇరిగేషన్ అధికారుల వద్ద 22వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. మూడు శాఖల అధికారులు క్లియర్ చేస్తేనే దరఖాస్తుదారులు ఫీజు చెల్లించే అవకాశం ఉంది. సమన్వయ లోపంతో పెద్ద సంఖ్యలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నెల 31తో 25 శాతం రాయితీ.

జడ్పీలో కారుణ్య నియామకాలకు లైన్‌క్లియర్

జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి నేడు ఆప్షన్స్ కౌన్సెలింగ్

హనుమకొండ, మార్చి 11: జిల్లా పరిషత్ కార్యాలయంలో కారుణ్య నియామకాలకు లైన్‌క్లియర్ అయ్యింది. 2015 సంవత్సరం నుంచి ఇప్పటివరకు దరఖాస్తు చేసుకున్న వారికి ఉద్యోగాలు లభించనున్నాయి. ఉద్యోగాలు చేస్తూ మృతిచెందిన వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగ అవకాశం కల్పిస్తారు. జిల్లా ప్రజా పరిషత్ పరిధిలో విధులు నిర్వర్తిస్తూ మృతిచెందిన వారి కుటుంబ సభ్యులు ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ 2015 నుంచి 58 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు మాత్రమే ఉండగా డిగ్రీ, బీటెక్, పీజీలు చదివినవారు కావడంతో చేరేందుకు ఎవరూ ముందుకు రాలేదు. వీఆర్వోలను సర్దుబాటులో భాగంగా జూనియర్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ అయ్యాయి. దీంతో కారుణ్య నియామక అభ్యర్థులు నిరీక్షించక తప్పలేదు. కాగా, ఖాళీగా ఉన్న 58 అటెండర్ పోస్టులను జూనియర్ అసిస్టెంట్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేయాలని జడ్పీ అధికారులు గతంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం ఇటీవల ఆమోదించడంతో కారుణ్య నియామకాల ద్వారా జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాలతో జిల్లా పరిషత్ అధికారులు కసరత్తు చేపట్టారు. ఇటీవల అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన చేయగా, 49 మంది హాజరయ్యారు. 9 మంది వివిధ కారణాలతో రాలేదు. వారు ఎప్పుడు వస్తే అప్పుడు నిబంధనల ప్రకారం ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు జడ్పీ అధికారులు తెలిపారు. సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిన 49మంది అభ్యర్థులకు బుధవారం హనుమకొండ జిల్లా పరిషత్ హాల్‌లో ఉదయం 11 గంటల నుంచి ఆప్షన్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో ఎం.విద్యాలత తెలిపారు.

సీపీ ఆఫీస్ ముందు అర్ధనగ్న నిరసన

మీడియాతో మాట్లాడుతున్న సురేందర్

సుబేదారి, మార్చి 11: తనకు న్యాయం చేయాలని ఓ వ్యక్తి మంగళవారం హనుమకొండలోని పోలీసు కమిషనరేట్ వద్ద అర్ధనగ్నంగా నిరసన తెలిపాడు. బాధితుడు గట్ల సురేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. స్వగ్రామం దుగ్గొండి మండలం పొనకల్లులో తనకు వారసత్వంగా వచ్చిన మూడు ఎకరాల భూమిని తన తమ్ముడు రాజు, ఇద్దరు మాజీ సర్పంచ్‌లతో వెంకటేశ్వర్లు, సదానందం సహకారంతో ఆక్రమించుకున్నాడని తెలిపాడు. దుగ్గొండి రెవెన్యూ అధికారులు తన తమ్ముడికి పట్టా పాస్‌బుక్‌లు ఇచ్చారని పేర్కొన్నాడు. అధికారులను కలిసినా తనకు న్యాయం చేయలేదని, సీపీ, కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.

జీనోమ్ ప్రాజెక్ట్‌తో వ్యాధుల గుట్టు రట్టు

జువాలజీ జాతీయ సదస్సులో కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి


సావనీర్ విడుదల చేస్తున్న కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా, మార్చి 11: మానవుడి వ్యాధులకు కారణమైన జన్యువులను 2010లో ప్రారంభమైన జీనోమ్ ప్రాజెక్ట్‌తో వ్యాధుల గుట్టు రట్టు చేయవచ్చని కాకతీయ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. జన్యు శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఇమ్యూనాలజీ, బయోటెక్నాలజీ అంశంపై జరుగుతున్న రెండు రోజుల జాతీయ సెమినార్‌లో ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. దేశంలోని పరిశోధకులు, అకడమిషియన్లు పాల్గొని జంతుశాస్త్రాల పరిశోధన పురోగమనంపై చర్చించడాన్ని కొనియాడారు. జంతు బయోటెక్నాలజీ, సెల్ అండ్ టిష్యూ కల్చర్, సెల్ అండ్ మాలిక్యూలర్ బయాలజీ, ఇమ్యునాలజీ, జంతుశరీర శాస్త్రం – జీవరసాయనం, పర్యావరణ జీవశాస్త్రం, పునరుత్పత్తి బయోటెక్నాలజీ, అభివృద్ధి జీవశాస్త్రం, పర్యావరణ, టాక్సికాలజీ వంటి అంశాల్లో చర్చలు జరగడం, అదనంగా, కృత్రిమ పెంపకం అండ్ మత్స్య పరిశ్రమ, ఆహారం, పోషణ వంటి అనుబంధ రంగాల్లో అనుసంధానాన్ని, జన్యు ఇంజినీరింగ్, బయోఇన్ఫర్మేటిక్స్, జెనోమిక్స్, ప్రోటియోమిక్స్, మెటబొలోమిక్స్ గురించి వివరించిన నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. బయోఫార్మా డైరెక్టర్ ప్రొఫెసర్ గీతాశర్మ డ్రగ్ డిస్కవరీపై కీలకోపన్యాసం చేశారు. ఒక మాలిక్యుల్ ఒక డ్రగ్‌గా మార్కెట్‌లోకి రావడానికి తక్కువలో తక్కువగా పదేళ్లు పడుతుందని, బయోఇన్ఫర్మాటిక్స్ అభివృద్ధి చెందినందున ఖర్చు, సమయం రెండూ కలిసి రావడం పరిశోధన రంగంలో జరిగిన పురోగతి అని అన్నారు. జాతీయ సదస్సు నిర్వాహకులు ప్రొఫెసర్ వెంకయ్య, జన్యుశాస్త్రం విభాగాధిపతి ప్రొఫెసర్ శమిత, సైన్స్ డీన్ ప్రొఫెసర్ హన్మంతు, చైర్మన్ బోర్డు ఆఫ్ స్టడీస్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, మామిడాల ఇస్తారి పాల్గొన్నారు.

సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లను సమర్థంగా నిర్వహించాలి

వరంగల్, మార్చి 11: బల్దియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లను సమర్థవంతంగా నిర్వహించాలని కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. బాలసముద్రం వెహికిల్ షెడ్‌లోని సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. రోజూ ఎన్ని స్వచ్ఛ ఆటోలు సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు వస్తున్నాయనే వివరాలు తెలుసుకున్నారు. తప్పనిసరిగా కంప్రెషర్లు రోజూ మూడు ట్రిప్పులు తిరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మరమ్మతుల కోసం షెడ్‌లకు వచ్చే వాహనాలకు త్వరితగతిన మరమ్మతులు చేయాలన్నారు. ఆమె వెంట ఈఎంహెచ్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో రాజేశ్, ఈఈ మహేందర్, డీఈ శివానంద్, శానిటరీ సూపర్‌వైజర్ నరేందర్, ఏఈ సంతోష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిల్ పాల్గొన్నారు.

రోడ్డుపై మందుబాబుల హంగామా

మద్యం తాగుతున్న మందుబాబులు

నయీంనగర్, మార్చి 11: హనుమకొండలోని సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధి పాత బస్‌డిపో సమీపంలో ఓ వైన్‌షాపు ఎదుట మందుబాబులు రోడ్లపైనే మద్యం తాగుతూ హంగామా చేస్తూ ఇబ్బందులు కలిగిస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. రోజూ సాయంత్రం కాగానే రోడ్లపైనే బైక్‌లు పార్క్ చేసి అక్కడే మద్యం తాగుతున్నారు. అటుగా వెళ్లే వాహనదారులకు ఎదురుపడి మద్యం మత్తులో గొడవలకు దిగుతుండటంతో భయపడుతున్నారు. ఈ విషయం పోలీసులకు చెప్పినా పట్టించుకోవడంలేదని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లా హాకీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా పరమేశ్వర్

నియామకపత్రాన్ని అందజేస్తున్న రామకృష్ణ, అజీజ్‌ఖాన్

హనుమకొండ చౌరస్తా, మార్చి 11: జిల్లా హాకీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా సుంకరి పరమేశ్వర్ నియమితులయ్యారు. హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు సోద రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి హుస్సేన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ అజీజ్‌ఖాన్ చేతులమీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సృజన్‌కాంత్, రోయింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బిన్నీ లక్ష్మణ్, కార్పొరేటర్ ఏనుగుల మానసరాంప్రసాద్, ప్రభాకర్ పాల్గొన్నారు.

రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాజీపేట, మార్చి 11: కాజీపేట రైల్వే జంక్షన్ – హసన్‌పర్తి రైల్వేస్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి రైలుకింద పడి మృతిచెందిన ఘటన మంగళవారం సాయంత్రం వెలుగు చూసింది. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చింతగట్టు అండర్ బ్రిడ్జి సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. మృతుడు 35 నుంచి 40 ఏళ్ల వయస్సు, 5.3 అడుగుల ఎత్తు, చామన ఛాయ, ఛాతిపై పుట్టుమచ్చ కలిగి, పసుపు రంగు షర్ట్, బ్లాక్ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు వివరించారు. మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం మార్చురీలో భద్రపరిచామని, సంబంధీకులు ఉంటే కాజీపేట జీఆర్పీ స్టేషన్, 871268496, 9948348070 సెల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ

ఆత్మకూరు, మార్చి 11: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ అప్పయ్య మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులు, ఆరోగ్య క్లినిక్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మహిళలకు ఆరోగ్య క్లినిక్‌లో అందిస్తున్న ఎనిమిది రకాల సేవలను ప్రజలకు వివరించాలన్నారు. ఆయుష్ వైద్యాధికారి చైతన్య, కమ్యూనిటీ హెల్త్ అధికారి జునేది పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

పరకాల, మార్చి 11: కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులు, బాధిత కుటుంబాలకు పంపిణీ చేశారు. ఆర్డీవో నారాయణ, అధికారులు పాల్గొన్నారు.

మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

పరకాల, మార్చి 11: ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పూర్వ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ పిలుపునిచ్చారు. పట్టణంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వరంగల్ ఉమ్మడి జిల్లాలో పనిచేసిన ఎస్ఎఫ్ఐ పూర్వ నాయకులను సమీకరించి ఈనెల 23న కాళోజీ కళాక్షేత్రంలో మహా సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. గంగాధర్, దామెర రాజేందర్, తిరుపతి, నరేశ్, అయిలయ్య, నక్క చిరంజీవి, రుద్ర ప్రసాద్, సురేందర్, చంద్రమౌళి, క్రాంతి, సంపత్, కరుణాకర్, కుమార్, ప్రశాంత్, ప్రభాకర్, రవి పాల్గొన్నారు.

ఎయిడ్స్‌ను సమష్టిగా నిర్మూలించాలి

హనుమకొండ, మార్చి 11: ఎయిడ్స్‌ను సమష్టిగా నిర్మూలించాలని జిల్లా అదనపు వైద్యాధికారి మదన్మోహన్ అనారు. మంగళవారం సంపూర్ణ సురక్ష కేంద్రం, చాతి అండ్ టీబీ హాస్పిటల్ ఆధ్వర్యంలో మేనేజర్ ఇక్బాల్ పాషా అధ్యక్షతన హనుమకొండ ఏషియన్ మాల్, జితేందర్‌సింగ్‌నగర్‌లో మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. దాదాపు 148 మందికి వైద్య పరీక్షలు చేశారు. చాతీ, టీబీ ఆస్పత్రి సూపరింటెండెంట్ సునిత, మెడికల్ ఆఫీసర్ శ్రీనివాస్ మాట్లాడారు. జీఎంహెచ్ మెడికల్ ఆఫీసర్ గీత, శ్రవణ్, అరుణ్, ఐసీటీసీ కౌన్సిలర్ రాపర్తి సురేశ్, డీఎస్‌ఆర్‌సీ కౌన్సిలర్ రామ్‌కుమార్, జితేందర్‌సింగ్ నగర్ వాసులు సౌరమ్ రఘు పాల్గొన్నారు.

వరంగల్ డీఐకి ఏడీగా పదోన్నతి

నయీంనగర్, మార్చి 11: వరంగల్ జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అధికారి (డ్రగ్ ఇన్‌స్పెక్టర్)గా విధులు నిర్వహిస్తున్న ఎం అరవింద్ కుమార్‌కు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు రాష్ట్ర డ్రగ్ కంట్రోలర్ వీబీ కమల్ హాసన్ రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతిపై అరవింద్‌కుమార్ ఖమ్మం అసిస్టెంట్ డైరెక్టర్‌గా బదిలీ కాగా ఆయన స్థానంలో జనగామ జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అధికారి (డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా)గా విధులు నిర్వర్తిస్తున్న ఏ.బాలకృష్ణకు వరంగల్ జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఉత్తర్వులు వెలువరించారు.

ఆలయంలో హుండీ డబ్బులు చోరీ

శాయంపేట, మార్చి 11: మండలంలోని సూరంపేట హనుమాన్ ఆలయంలో హుండీని గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి డబ్బులు చోరీ చేసిన ఘటన మంగళవారం వెలుగు చూసింది. స్థానికుల కథనం ప్రకారం.. స్థానిక భజన మండలి సభ్యులు ఉదయమే ఆలయానికి రాగా హుండీ తాళం పగులగొట్టి, కింద పడేసి ఉండగా గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. వారు చూసి చోరీ జరిగినట్లు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా కానిస్టేబుళ్లు వచ్చి పరిశీలించినట్లు స్థానికులు చెప్పారు.

ఫాతిమా కేథడ్రల్ చర్చిలో ఉత్సవాలు ప్రారంభం


సందేశాన్ని ఇస్తున్న ఉడుముల బాల

న్యూశాయంపేట, మార్చి 11: హనుమకొండ ఫాతిమా కేథడ్రల్ చర్చిలో ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఫాతిమా దివ్యపూజ బలి మహాపూజ్య డాక్టర్ ఉడుముల బాల ఉత్సవాలను ప్రారంభించి సందేశాన్ని అందించారు. సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుపుకుంటున్న దంపతులను వారు ఘనంగా సన్మానించారు. వరంగల్ కమిషనరేట్ సెంట్రల్‌జోన్ డీసీపీ షేక్ సలీమా చర్చిని సందర్శించారు. డీసీపీ వెంట కాజీపేట సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్సై లవన్‌కుమార్ ఉన్నారు. ఫాతిమా మాత పండుగ బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, మార్చి 11: హనుమకొండ టౌన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ ఆపరేషన్ డీఈ జీ సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అభివృద్ధి పనుల్లో భాగంగా బుధవారం నక్కలగుట్ట సబ్‌స్టేషన్ భవానీనగర్ 11కేవీ ఫీడర్ పరిధిలోని భవానీనగర్, భవానీ మాతా టెంపుల్ ఏరియాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు.

పెన్షన్ డబ్బుల కోసం కొడుకుల వేధింపులు

కలెక్టరేట్ గ్రీవెన్స్‌లోనూ ఫిర్యాదు

రిటైర్డ్ ఉపాధ్యాయుడు పిల్లల నారాయణ

కమలాపూర్, మార్చి 11: పెన్షన్ డబ్బుల కోసం కొడుకులు వేధిస్తున్నట్లు ఓ రిటైర్డ్ ఉపాధ్యాయుడు వాపోయాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గూడూరుకు చెందిన పిల్లల నారాయణ(89) ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. 25ఏళ్ల క్రితం భార్య చనిపోయింది. నలుగురు కొడుకులు, నలుగురు కూతుర్లు. కుమారులను బాగా చదివించాడు. పెద్ద కొడుకు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసి రిటైర్డ్ అయ్యాడు. రెండో కొడుకు వ్యవసాయం చేస్తున్నాడు. మూడో కొడుకు ప్రైవేట్ ఉపాధ్యాయుడు. నాలుగో కొడుకు పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. 16 ఎకరాల వ్యవసాయ భూమిని కొడుకులకు పంచి ఇచ్చాడు. మరో 2ఎకరాలు తన వద్దే ఉంచుకొని, స్వగ్రామంలో రెండో కొడుకు వద్ద ఉంటున్నాడు. కొంత కాలంగా అనారోగ్యానికి గురైనా ఏ కొడుకూ పట్టించుకోలేదు. తనకు వస్తున్న పెన్షన్ డబ్బులు ఇవ్వాలని కొడుకులు ఇబ్బందికి గురిచేయడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. హనుమకొండ, స్టేషన్ ఘన్‌పూర్, కరీంనగర్‌లో నివసిస్తున్న ముగ్గురు కొడుకులు తన బాగోగులు చూసుకుంటున్న రెండో కొడుకును తిడుతూ 2ఎకరాల వ్యవసాయ భూమిని ఎవరినీ కౌలుకు దున్ననివ్వడంలేదు. దీంతో వ్యవసాయభూమి పడావుగా ఉంది. పెన్షన్ డబ్బులు ఇవ్వాలని శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారు. వండిపెట్టే దిక్కు లేకపోవడంతో పాత ఇంట్లో రెండో కొడుకుతో ఉండగా, అతడితో ఉండొద్దని గోడ కట్టారు. దీంతో రెండో కొడుకు ఇల్లు ఖాళీ చేసి అద్దెకు ఉంటున్నాడు. 'నేను ఒక్కడినే పాత ఇంట్లో ఉంటే నడవలేని స్థితిలో ఒకటికీ, రెంటికీ బయటకు ఎట్ల పోవాలే? అని రెండో కొడుకు వద్దనే ఉంటున్న. నెల రోజులైతాంది. పానం బాగలేక ఒక్క కొడుకు వచ్చి చూసింది లేదు' అని కన్నీటి పర్యంతమయ్యాడు. తన పెన్షన్ దవాఖాన ఖర్చులకే అయిందని, ఆలనా పాలనా చూసుకొని కొడుకులకు పెన్షన్ డబ్బులు ఇస్తే తానెట్లా బతికేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. తన పేర ఉన్న 2ఎకరాల వ్యవసాయ భూమి, పెన్షన్ డబ్బులు తనకే ఉండేలా చూడాలని, కొడుకుల వేధింపుల నుంచి కాపాడాలని కలెక్టర్‌ను వేడుకున్నట్లు తెలిపారు.

డీసీసీ బ్యాంక్‌లో ఘనంగా మహిళా దినోత్సవం


కేక్ కట్ చేస్తున్న మహిళా ఉద్యోగులతో మార్నేని

హనుమకొండ, మార్చి 11: హనుమకొండలోని వరంగల్ జిల్లా సహకార కేంద్ర (డీసీసీ) బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ రవీందర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మహిళా ఉద్యోగులకు శాలువాలతో సన్మానించి బహుమతులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. సీఈఓ వజీర్ సుల్తాన్, జీఎం ఉషా, ఏజీఎంలు గొట్టం స్రవంతి, మధు, రాజు, కృష్ణమోహన్, ఓఎస్డీ విజయకుమారి, యూనియన్ అధ్యక్షురాలు రజిత పాల్గొన్నారు. కాగా, డీసీసీ బ్యాంక్ మేనేజర్లతో సమీక్షలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మాట్లాడారు. రుణమాఫీ లబ్ధిపొందిన రైతులకు త్వరగా కొత్త పంట రుణాలు ఇవ్వాలని సూచించారు. ఏవైనా టెక్నికల్ సమస్యలు ఉంటే పరిష్కరించాలని చెప్పారు.

సీనియర్ సిటిజన్స్ సేవలు అభినందనీయం

హనుమకొండ, మార్చి 11: ప్రతి సోమవారం గ్రీవెన్స్ సెల్ కార్యక్రమంలో వృద్ధులు, మహిళలు నిరక్షరాస్యులకు దరఖాస్తులు రాసి ఇస్తున్న సీనియర్ సిటిజన్స్ సేవలు అభినందనీయమని కలెక్టర్ పీ ప్రావీణ్య అన్నారు. మంగళవారం విద్యారణ్యపురి, గోపాల్‌పురం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, హనుమకొండ జిల్లా గ్రీవెన్స్ హెల్ప్‌డెస్క్ సభ్యులు కలెక్టర్‌ను కలిశారు. నాలుగు నెలలుగా కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ సెల్ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ నిర్వహించిన హెల్ప్‌డెస్క్ నివేదికను అందజేశారు. తీరాల యుగేందర్, కార్యదర్శి మార్క రవీందర్‌గౌడ్, సంయుక్త కార్యదర్శి కొండబత్తిని రాజేందర్, కోశాధికారి గుంటి సీతారాములు, శివాజీ, గుంటి సాంబయ్య ఉన్నారు. కాగా, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని వివిధ అభివృద్ధి పనులపై పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియ, కాజీపేట బస్‌స్టేషన్ స్థలం కేటాయింపు అంశాలపై చర్చించారు. ఆర్డీవో రాథోడ్ రమేశ్, తహసీల్దార్లు శ్రీపాల్‌రెడ్డి, బావ్‌సింగ్, బీసీ వెల్ఫేర్ డీడీ రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

సమయపాలన పాటించని పీహెచ్‌సీ డాక్టర్లు, సిబ్బంది

9.36 గంటలైనా ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న కుర్చీలు

ఐనవోలు, మార్చి 11: మండలంలోని కొండపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించడంలేదు. దీంతో వైద్యం కోసం వచ్చిన రోగులు నిరీక్షించాల్సి వస్తోంది. ఉద యం 9గంటలకే విధులకు హాజరు కావాల్సి ఉండగా మంగళవారం సకాలంలో రాలేదు. ఆలస్యంగా సుమారు 9.45 గంటలకు వచ్చారు. ఈ పీహెచ్‌సీలో ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు, ముగ్గురు స్టాఫ్‌నర్సులు, ఫార్మసిస్ట్, హెచ్ ఈవో, సూపర్‌వైజర్లు మొత్తం 8 మంది వైద్య సిబ్బంది ఉన్నారు. కొండపర్తి, వనమాలకనపర్తి, ముల్కలగూడెం, నర్సింహులగూడెం, వెంకటాపురం, గర్మిళ్లపల్లి, లింగమోరిగూడెం నుంచి రోగులు ఉదయం 8:30 గంటలకే చేరుకొని నిరీక్షించారు. ఆలస్యమైనా రాకపోవడంతో వైద్యులు ఎప్పుడు వస్తారని కొందరు తౌలుత వచ్చిన సిబ్బందిని నిలదీశారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే డాక్టర్లు, సిబ్బంది సమయ పాలన పాటించడంలేదని రోగులు ఆవేదన ఆరోపించారు.

సమాజంలో మహిళల పాత్ర కీలకం

జిల్లా సంక్షేమాధికారి జే జయంతి


మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారి జయంతి

హనుమకొండ, మార్చి 11: సమాజంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని జిల్లా సంక్షేమాధికారి జే జయంతి అన్నారు. మంగళవారం హనుమకొండ సుబేదారిలోని అసుంత భవన్‌లో ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ, వనం మహిళా సంఘం ఆధ్వర్యంలో సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ అధ్యక్షతన జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లింగ సమానత్వాన్ని సాధించేందుకు మహిళలు తమ ఆరోగ్యంపై దృష్టిసారించాలని సూచించారు. మహిళలు ఆర్థిక, సామాజిక అభివృద్ధి సాధించాలన్నారు. మహిళలు, పిల్లలకు ఏవైనా సమస్యలు ఎదురైతే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, సఖి వన్‌స్టాప్ సెంటర్ 181 నంబర్‌కు ఫోన్ చేసి సాయం పొందాలని సూచించారు. హనుమకొండ బాల రక్ష భవన్ కోఆర్డినేటర్ అవంతి, బాలల సంక్షేమ అధికారి ఎస్ ప్రవీణ్‌కుమార్, వనం సీఈవో సిస్టర్ నిర్మల, సఖి సెంటర్ అడ్మిన్ హైమావతి, సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎర్ర శ్రీకాంత్, మేనేజర్ అజయ్‌కుమార్, ఫీల్డ్ కో ఆర్డినేటర్లు ఇసంపల్లి సుదర్శన్, సమర శిరీష, వనం మహిళా సంఘం అధ్యక్షురాలు మేరీ, రాజేశ్వరి, సుందరి, అనిత, జయ హాజరయ్యారు.

కారును తప్పించబోయి డివైడర్ ఢీకొన్న గ్రానైట్‌లారీ



సుబేదారి, మార్చి 11: ఇన్నోవా కారును తప్పించబోయి గ్రానైట్ లోడ్ లారీ డివైడర్‌ను ఢీకొన్న ఘటన మంగళవారం తెల్లవారుజామున సుబేదారి ఫారెస్ట్ ఆఫీస్ జంక్షన్ వద్ద జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కాజీపేట నుంచి హంటర్‌రోడ్డు వైపు గ్రానైట్ రాళ్లతో వెళ్తున్న లారీకి సుబేదారి ఫారెస్ట్ ఆఫీస్ జంక్షన్ వద్ద రెవెన్యూకాలనీ నుంచి వేగంగా ఇన్నోవా కారు అడ్డుగా రావడంతో లారీ డ్రైవర్ సడన్ బ్రేక్‌వేయగా అదుపుతప్పి డివైడర్ పైకెక్కింది. ట్రాఫిక్ సిగ్నల్ పోల్స్, సీసీ కెమెరాలు దెబ్బతిన్నాయి. కారులోని వారికి, లారీడ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు చేరుకొని క్షతగాత్రులను అంబులెన్స్‌లో హాస్పిటల్‌కు తరలించారు. మధ్యాహ్నం భారీ క్రేన్‌తో లారీని తీసి ట్రాఫిక్‌ను పునరుద్ధించారు. లారీ, ఇన్నోవా ముందు భాగాలు దెబ్బతిన్నాయి.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

నమస్తే, నెట్‌వర్క్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. ఏకశిలా పార్కు వద్ద మంగళవారం మూడోరోజుకు చేరగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ అధ్యక్షత వహించగా ఎమ్మెస్పీ జాతీయ నేత వేల్పుల సూరన్న కాపు మాట్లాడారు. కమలాపూర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు రిలే నిరాహార దీక్షలు జిల్లా ప్రధాన కార్యదర్శి అంకిల్ల రాజు ఆధ్వర్యంలో ప్రారంభించారు. కేయూ దూరవిద్య కేంద్రం వద్ద ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రిలేదీక్షలు చేపట్టారు. ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, ఎల్పీ రాజకుమార్, పోడేటి శ్రీనివాస్ దీక్షలు ప్రారంభించారు. ఎంఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొచ్చు తిరుపతి మాదిగ, కేయూ అధ్యక్షుడు కుమ్మరి శ్రీనాథ్ మాదిగ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షకు బీసీ సెల్ డైరెక్టర్ ఆకుతోట శ్రీనివాస్, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు పాలమాకుల కొమరయ్య, ఆరూరి రంజిత్, బైరపాక ప్రశాంత్ పాలొన్నారు. పరకాలలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ మాట్లాడారు. కుమార్, పెండెల సురేశ్, పసుల మధూకర్, బొచ్చు శరత్‌బాబు, చిలువేరు రమేశ్ పాల్గొన్నారు. ఆత్మకూరులో జిల్లా నాయకులు అర్షం సుధాకర్, మండల అధ్యక్షుడు నద్దునూరి రఘు, ప్రధాన కార్యదర్శి వేల్పుల గణేశ్, ఉపాధ్యక్షులు కలకోటి రాజేశ్ పాల్గొన్నారు. గ్రేటర్ కార్యాలయం ఆవరణలో దీక్షల్లో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు చాతాల్ల రమేశ్, కట్ల రాజశేఖర్ మాట్లాడారు.

ప్రకటన

ఇందుమూలంగా సమస్త ప్రజలకు తెలియజేయునది ! నా క్లయింట్ అయిన కలంగూరి దివ్య, భర్త : కలంగూరి సుభాష్ చందర్, కొడవలంచ వాస్తవ్యులు ; కొలిశెట్టి వసుధ, భర్త : కె. రమణారావు, విజయపాల్ కాలనీ గారు, క్రింది షెడ్యూల్‌లో పేర్కొనిన ఆస్తిని అమ్ముచూపగా, నా క్లయింట్ కొనుగోలుచేయుటకు ఆసక్తి చూపి, అందునిమిత్తం కొంత నగదు పై అమ్మకం దారుకు చెల్లించి, కొనుగోలు ఒప్పందం చేసుకున్నారు. ఈ ఆస్తి కొనుగోలు వ్యవహారంపై ఎవ్వరికైనా అభ్యంతరం ఉన్నట్లయితే, ఈరోజు నుండి వారం రోజులలోపు, క్రింది అడ్రస్ దారుకు తగిన ఆధారాలతో సంప్రదించగలరు. లేనట్లయితే తదుపరి వచ్చే ఆక్షేపణలు పరిగణ లోకి తీసుకోవడం జరుగదని, అట్టి ఆస్తిని, నా క్లయింట్ పేరున గానీ, ఆమె తరుపు నామినీపై గానీ రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరుగుతుందని ఇందుమూలంగా తెలియ చేస్తున్నాం.

షెడ్యూల్ ఆస్తి వివరాలు

ఇంటి నెంబర్ 1-7-44/2/A, ప్లాట్ నెం.34 లోగల విస్తీర్ణం 300.00 చ.గజాలు, సర్వే నెం.495, 506,509 మరియు 510 వడ్డేపల్లి రెవెన్యూ శివారు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో గల, హన్మకొండ జిల్లాలోని క్రింది హద్దులు అస్తి : తూర్పు : 30 ఫీట్ల రోడ్ ; పడమర : ప్లాట్ నెం. 33 ; ఉత్తరం : 30 ఫీట్ల రోడ్ ; దక్షిణం : ప్లాట్ నెం. 35

తేది: 12-03-2025

Sd/- BHEEMANATH PURNA CHANDRA MOHAN
M.Com, LL.B, M.A.(Psy)
Advocate
H.No: 25-4-481/1, Vishnupuri, Kazipet, Hanumakonda.
Pin Code: 506 003, Cell.No: 9849643839

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★OT-TECHNICIANS (Exp.), PHARMACY (Exp.), LAB-TECHNICIANS (Exp.), DHOBI Worker & Computer Operators. Cont: Guardian Hospital, Mulugu 'X' Road, Wgl. 12 to 2 pm.
NTW-488

CHANGE OF NAME

★I, THOUTAM BHAGYA LAXMI, W/o. THOUTAM RAMBABU, R/o. 2-10-206, Kummari Wada, Near Pingili College, Waddepally, Hanumakonda-Dist T.S., have Changed my name from BHAGYALAKSHMI TATIPAMULA to BHAGYA LAXMI THOUTAM for all purposes.
NTW-6568

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565